వరి సాగు తగ్గలేదు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి వ్యవసాయ శాఖ వివరణ

హైదరాబాద్, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): గత వానకాలంతో పోల్చితే ఈ వానకాలంలో వరి సాగు ఉత్పత్తి తగ్గలేదని వ్యవసాయ శాఖ డైరెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో 'పెరిగిందెక్కడ? తగ్గుడే' శీర్షికన ప్రచురితమైన వార్తకు వివరణ ఇచ్చారు. గత వానకాలం సీజన్‌లో 65.92 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 144.85 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్టు పేర్కొన్నారు. ఈ వానకాలంలో తుది అంచనాల ప్రకారం 66.78 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 156.26 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్టు వెల్లడించారు. బియ్యం ఉత్పత్తి గతంలో 97.65 లక్షల టన్నులు ఉండగా, ఈ సీజన్‌లో 103.61 లక్షల టన్నులు ఉత్పత్తి అయినట్టు వివరించారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

- బీసీ నేత ఆర్ కృష్ణయ్య డిమాండ్
- సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ

హైదరాబాద్, డిసెంబర్8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, లేకుంటే 10వ తేదీన కలెక్టర్లు, ఎమ్మార్వో కార్యాలయాలను ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసి మీడియాకు విడుదలచేశారు. బకాయిలు చెల్లించాలని రాష్ట్రంలోని 1800 కాలేజీలు బంద్ చేపట్టాయని, అయినా సర్కారు స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడలేదని మండిపడ్డారు. అనేక స్కీములు, కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం వద్ద.. విద్యార్థుల మెస్ బిల్లులు, స్కాలర్‌షిప్‌లు చెల్లించేందుకు బడ్జెట్ లేదా? అని ప్రశ్నించారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 16.75 లక్షల మంది విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఉన్నతవిద్య, ఉద్యోగావకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ల ముట్టడిలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి ప్రాధాన్యంగా విజయోత్సవాలా!

- పార్టీ పాలసీ ఒకటైతే మీరు చేస్తున్నదేమిటి?
- ముఖ్యనేత తను నిలబడిన సీనియర్ మంత్రి
- పునరంకిత సభల స్థానంలో స్వోత్కర్ష సభలా అంటూ మండిపాటు
- ఇవి వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకునే సభలని అసంతృప్తి
- ప్రగతి నివేదికలపై సీనియర్ మంత్రుల సహాయ నిరాకరణ
- వ్యవసాయ శాఖ నుంచి వెల్లడి కాని ప్రగతి నివేదిక

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఏడాది పాలన పూర్తి చేసుకున్నప్పుడు పునరంకిత సభలు పెటుకోవడం కాంగ్రెస్ పార్టీ ఆనవాయితీ అని, కానీ రాష్ట్రంలో విజయోత్సవ సభల పేరుతో వ్యక్తిగత గొప్పలు, స్వోత్కర్ష వేదికలుగా మారుస్తున్నారని సీనియర్ కాంగ్రెస్ మంత్రి ఒకరు ముఖ్యనేతకు ఎదురు తిరిగినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఇది పార్టీ పాలసీకి విరుద్ధమని తెగేసి చెప్పినట్టు సమాచారం. కాసు బ్రహ్మానందరెడ్డి హయాంలో పునరంకిత సభలు పెట్టారని.. ఆ సంస్కృతిని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొనసాగించారని ఆయన గుర్తు చేసినట్టు అత్యంత విశ్వసనీయ వ్యక్తుల ద్వారా తెలిసింది. ఈ మేరకు ఇటీవల ఓ జిల్లాలో జరిగిన బహిరంగ సభ అనంతరం సీనియర్ మంత్రి తన అసంతృప్తి వెళ్లగక్కినట్టు తెలిసింది. పాలనా వైఫల్యాలపై ఆత్మ విమర్శ చేసుకుంటూ.. సాధించిన విజయాలను ప్రజలకు చెప్పుకుంటూ, ఇందిరమ్మ స్ఫూర్తితో మరింత మెరుగైన పాలనకు దిశానిర్దేశం చేసుకోవటం కోసం పునరంకిత సభలు జరుగుతాయని సదరు మంత్రి గుర్తు చేసినట్టు తెలిసింది. ఆ దిశగా ఇప్పటి వరకు ఒక్క సభ కూడా జరుగలేదని, కేవలం వ్యక్తి ప్రాధాన్య సభలు మాత్రమే జరుగుతున్నాయని, దేవుండ్ల మీద ఒట్లు, కేసీఆర్‌కు తిట్లు అన్నట్టు తప్ప కాంగ్రెస్ పార్టీని, భవిష్యత్తు పరిపాలనను పరిపుష్టి చేసుకునే విధంగా ఒక్క సభ కూడా సాగలేదని ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ పార్టీ నేతగా తాను ఇటువంటి సభలను సమర్థించలేనని తెగేసి చెప్పినట్టు తెలిసింది.

తప్పుడు సమాచారంతో ప్రజల్లోకి వెళ్లలేం

ఏడాది పాలన ప్రగతి నివేదికలు రూపొందించటంపై కూడా సీనియర్ మంత్రులు తమ సహాయ నిరాకరణ తెలియ చేసినట్టుగా తెలుస్తోంది. ఏడాది పాలనలో ఏమి అభివృద్ధి సాధించామని ప్రగతి నివేదికలు తయారు చేయాలని, తప్పుడు సమాచారంతో కూడిన ప్రోగ్రెస్ రిపోర్టులను తీసుకొని ప్రజల్లోకి వెళ్లి అబ్బాసుపాలు కాలేమని ఐదుగురు సీనియర్ మంత్రులు తెగేసి చెప్పినట్టు నిర్దిష్టంగా తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత కీలకంగా భావిస్తున్న వ్యవసాయశాఖ నుంచి ఇప్పటి వరకు ప్రగతి నివేదిక బహిర్గతం కాకపోవటంతో ముఖ్యనేత, సీనియర్ మంత్రుల మధ్య సంవాదం జరిగిందనే వాదనకు బలాన్నిస్తోంది. ఈ మేరకు ఏడాది పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు ఉంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, చేసిన ఖర్చు తదితర సమగ్ర వివరాలతో ప్రోగ్రెస్ రిపోర్టు తయారు చేయాలని సూచలిచ్చినట్టు సమాచారం. విపక్షాల విమర్శలకు కౌంటర్ ఇచ్చే విధంగా ప్రోగ్రెస్ రిపోర్టు ఉండాలని ముఖ్య నేత దిశానిర్దేశం చేసినట్టు గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత కీలకంగా భావిస్తున్న వ్యవసాయం, సివిల్ సప్లై, నీటిపారుదల, రోడ్లు భవనాల శాఖలకు చెందిన మంత్రులు ప్రగతి నివేదికలు ఇవ్వటానికి ఇప్పటి వరకు ముందకు రాలేదు. రూ 2 లక్షల రుణమాఫీ పూర్తి అయిందని ప్రభుత్వం ప్రకటించగా.. తమకు రుణమాఫీ కాలేదంటు వేల కొద్ది రైతు కుటంబాలు రోడ్డెక్కుతున్నాయి. రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000, వ్యవసాయ కూలీలకు రూ.12,000, రైతు భరోసా మీద ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన చేయలేకపోతున్న నేపథ్యంలో ప్రగతి నివేదికలు ఎలా ఇవ్వాలని సదరు శాఖ మంత్రి ముఖ్యనేత వద్ద తన నిస్సహాయతను వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ఉడికిపోతున్న ఉత్తమ్

నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల నుంచి ఇప్పటి వరకు ప్రగతి నివేదికలు బహిర్గతం చేయలేదు. ఈ రెండు శాఖలకు ఒకే సీనియర్ మంత్రి ఉండటం గమనార్హం. సదరు మంత్రికి, ముఖ్య నేతకు మధ్య అసలు పొసగటం లేదని గాంధీభవన్ వర్గాలే చెప్తున్నాయి. ముఖ్య నేత కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలను ఆయన పెడచెవిన పెడతారని, తన శాఖలో వేరొకరు వేలు పెట్టడానికి ఇష్టపడరనే ఆరోపణలు ఉన్నాయి. ఏడాది పాలనలో నీటిపారుదల రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసిందనే అభిప్రాయంతో సదరు మంత్రి ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయటం కానీ, పురోగతిలో ఉన్న ప్రాజెక్టుకు నిధులు కేటాయించటం కానీ చేయలేదని, కేవలం లగచర్ల పారిశ్రామిక కారిడార్‌ను దృష్టిలో పెట్టుకొని మొదలు పెట్టిన కొడంగల్ లిఫ్ట్ పనులకు మాత్రమే నిధులు ఇవ్వటంతో సదరు శాఖ మంత్రి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి విచారణకు ఆదేశించటం మినహా.. కుంగిన రెండు పిల్లర్లను రిపేర్ చేయటానికి నిధులు కేటాయించలేదు. ఈ నేపథ్యంలో తాను ఎటువంటి ప్రగతి నివేదికలు పట్టుకొని ప్రజల ముందుకు వెళ్లాలని సదరు మంత్రి ప్రశ్నించినట్టు తెలిసింది. రోడ్లు భవనాల శాఖ నుంచి కూడా ఏడాది పాలన మీద ఇప్పటి వరకు ప్రోగ్రెస్ రిపోర్టు వెల్లడి కాలేదు. ఆ శాఖలో కొత్తగా వేసిన రోడ్లు ఏమీ లేకపోవటం, కనీసం పాత రోడ్లను రిపేర్ చేయడానికి నిధులు కేటాయించక పోవటంతో సదరు మంత్రి ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు ఉంచకుండా ముఖం చాటేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మళ్లీ వీఆర్వో వ్యవస్థ

- పాత వీఆర్వోలు, వీఆర్‌ఏల సర్దుబాటు
- గ్రామ రెవెన్యూ అధికారులుగా పునరుద్ధరణ
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): మళ్లీ వీఆర్వో వ్యవస్థను తీసుకొస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. గతంలో వివిధ శాఖల్లోకి సర్దుబాటైన వీఆర్వోలు, వీఆర్‌ఏల్లో ఎంపికచేసిన వారిని మళ్లీ 10,954 రెవెన్యూ గ్రామాల్లో నియమిస్తామని చెప్పారు. మరో వెయ్యి మందిని సర్వే సెటిల్‌మెంట్ విభాగంలోకి తీసుకుంటామని తెలిపారు. సచివాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నూతన ఆర్వోఆర్ చట్టాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెడతామని ప్రకటించారు. 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి అక్కడ అమలవుతున్న మంచి అంశాలను నూతన చట్టంలో పొందుపరిచామని తెలిపారు. ఏడాది కాలంలో ధరణి పోర్టల్ ప్రక్షాళనకు అవసరమైన అనేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఎన్ని రోజులు సభ నిర్వహించాలో సోమవారం జరుగనున్న బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా నూతన ఆర్వోఆర్ చట్టాన్ని ప్రవేశపెట్టనున్నారు. కొత్తగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అందరి దృష్టి ఈ బిల్లుపైనే ఉన్నది. దీంతోపాటు తెలంగాణ వైద్యవిధాన పరిషత్తును ప్రభుత్వంలో విలీనం చేసి సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌గా మార్చే బిల్లును సైతం ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు వైద్యవర్గాలు తెలిపాయి. సమావేశాల ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ శాఖతో అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. సమావేశాలకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని సూచించారు. కౌన్సిల్ చైర్మన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రొటోకాల్ విషయంలో వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సభ సజావుగా సాగేందుకు సహకరిస్తామని శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, సీఎస్ శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రవిగుప్తా, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, డీజీపీ జితేందర్, ఏడీజీ మహేశ్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు చర్చకు వచ్చే అంశాలు

1) జీతాలు, పింఛన్ల చెల్లింపు, అనర్హతల తొలగింపు (సవరణ) ఆర్డినెన్స్ 2024
2) తెలంగాణ పురపాలక సంఘాల (సవరణ) ఆర్డినెన్స్ 2024
3) హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (సవరణ) ఆర్డినెన్స్ 2024
4) తెలంగాణ వస్తువుల, సేవల పన్ను (సవరణ) ఆర్డినెన్స్ 2024
5) 2022-23 సంవత్సరానికి గాను తెలంగాణ విద్యుత్తు ఆర్థిక సంస్థ లిమిటెడ్ 9వ వార్షిక నివేదిక
6) 2021-22 సంవత్సరానికిగాను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ 7వ వార్షిక నివేదిక
7) తెలంగాణ పంచాయతీరాజ్ (సవరణ) ఆర్డినెన్స్ 2024

సంక్రాంతికి 'గౌడ' భవనానికి శంకుస్థాపన

మాట్లాడుతున్న గోపా ప్రెసిడెంట్ బండి సాయన్న గౌడ్

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 8: జిల్లా గౌడ కమ్యూనిటీ భవనానికి సంక్రాంతికి ముందుగానీ, తర్వాతగానీ శంకుస్థాపన చేయనున్నట్లు గౌడ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ గౌడ్ చెప్పారు. నగరంలోని మంచికంటి భవన్‌లో గోపా జిల్లా అధ్యక్షుడు గుడిద శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్, విశిష్ట అతిథిగా మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ గౌడ్ పాల్గొన్నారు. ఇటీవల వివిధ ప్రభుత్వ శాఖల్లోలో ఉద్యోగాలు సాధించిన వారిని, పదోతరగతి పరీక్షల్లో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలను అతిథులు అందజేసి సత్కరించారు. వారు మాట్లాడుతూ.. గౌడ కమ్యూనిటీ భవన నిర్మాణానికి అందరూ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. సూర్యాపేట అదనపు కలెక్టర్ పర్సారాంబాబు, జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ గణేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు టి.రామకృష్ణ, మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

గరికపాటి రాఘవయ్యకు నివాళి

గరికపాటి సోదరులను పరామర్శిస్తున్న బెల్లం వేణుగోపాల్

ఖమ్మం రూరల్, డిసెంబర్ 8 : ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, శ్రీసిటీ అధినేతలు గరికపాటి వెంకట్రావ్, అంజనేయప్రసాద్‌ల తండ్రి రాఘవయ్యకు పలువురు ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఆదివారం కరుణగిరి ఏరియాలో జరిగిన రాఘవయ్య సంతాపసభకు హాజరై గరికపాటి సోదరులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, కొండబాల కోటేశ్వరరావు, ఖమ్మం మేయర్ నీరజ, తుమ్మల యుగంధర్, బాలసాని లక్ష్మీనారాయణ ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొణిజర్ల, డిసెంబర్ 8 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పల్లిపాడు గ్రామానికి చెందిన షేక్ జానిమియా(55) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. నాలుగురోజుల క్రితం పల్లిపాడులో రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ ఢీకొని రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జానిమియా మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సబ్సిడీ పడట్లే!

- సబ్సిడీ కోసం వినియోగదారుల ఎదురుచూపులు
- గ్యాస్ ఏజెన్సీలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- సరైన సమాధానం ఇవ్వని అధికారులు, సిబ్బంది
- 'గ్యారెంటీ'లన్నీ బూటకమేనంటున్న లబ్ధిదారులు

రఘునాథపాలెం, డిసెంబర్ 8: రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామానికి చెందిన బాలిన నాగమణి ఇండియన్ కంపెనీ గ్యాస్ లబ్ధిదారురాలు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అని కాంగ్రెస్ గ్యారెంటీ హామీ ఇవ్వగానే మురిసిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలన దరఖాస్తులో సబ్సిడీ గ్యాస్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఆ దరఖాస్తు ఏమైందో గానీ.. నాలుగుసార్లు గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేసినా సబ్సిడీ మాత్రం జమ కావట్లేదు. దీంతో గ్యాస్ సిలిండర్‌కు పూర్తి ధర చెల్లిస్తూ లబోదిబోమంటోంది. మొదటి గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేసిన నాటి నుంచి సబ్సిడీ నగదు కోసం సదరు గ్యాస్ కంపెనీ చుట్టూ, గ్యాస్ లింకేజీ ఉన్న బ్యాంక్ చుట్టూ తిరుగుతూనే ఉంది. గ్యాస్ ఏజెన్సీ వద్దకు వెళ్తే సరైన సమాధానం దొరకట్లేదు. బ్యాంకుకెళ్లి చెక్ చేసుకోవాలని గ్యాస్ కంపెనీ ప్రతినిధులు సూచించారు. బ్యాంకుకు వెళ్లి అక్కడి అధికారులను అడిగితే.. తమకు సంబంధం లేదంటూ వారు తేల్చిచెబుతున్నారు. చివరాఖరుకు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్తే.. అధికారులు కూడా 'మేమేం చేయాలి?' నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారు. ఇలా ఏడాది గడిచినా నాగమణికి మాత్రం గ్యాస్ సబ్సిడీ నగదు జమ అయిన పాపానపోలేదు. ఇది ఒక్క నాగమణి సమస్యే కాదు.. రఘునాథపాలెం మండలంలో 50 శాతానికిపైగా గ్యాస్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్య. ఓ పక్క ఆరు గ్యారెంటీల్లో గ్యాస్ సబ్సిడీ 100 శాతం ఇస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటూ ప్రజాపాలన విజయోత్సవాలను జరుపుకుంటున్న కాంగ్రెస్ సర్కార్.. క్షేత్రస్థాయిలో గ్యాస్ సబ్సిడీని కూడా వినియోగదారులకు సక్రమంగా అందించని విషయం తేటతెల్లమవుతోంది.

నాలుగు సార్లు సిలిండర్ తీసుకున్నా సబ్సిడీ రాలేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే రూ.500కే గ్యాస్ కనెక్షన్ కోసం రేషన్ కార్డు ఉన్న నేను ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసుకున్న నాటి నుంచి నాలుగుసార్లు గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేశాను. తెల్లరేషన్ కార్డు ఉన్నప్పటికీ మాకు ఈ పథకం అమలు కాలేదు. గ్యాస్ ఏజెన్సీ చుట్టూ, బ్యాంకు చుట్టూ తిరిగినా ఫలితం లేదు. ఎంపీడీవో ఆఫీస్‌కు వెళ్తే అక్కడి అధికారులు పట్టించుకోవడం లేదు. మంత్రులు మాత్రం 'ఆరు గ్యారెంటీలు నిరంతర ప్రక్రియ..' అంటూ గొప్పలు చెబుతున్నారు. మాలాంటి పేదలకే పథకం అమలుకాకపోతే ఇంకెవరికి అమలవుతున్నట్లు?

–బాలిన నాగమణి, వేపకుంట్ల, గ్యాస్ వినియోగదారురాలు

రీజినల్ ట్రైబల్ ఎంప్లాయీస్ కార్యవర్గం ఎన్నిక

వెంకటేశ్వర్లు

కోక్యానాయక్

కూసుమంచి, డిసెంబర్ 8 : తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజనల్ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు నందా రాథోడ్, భద్రుపవార్ సమక్షంలో ఎన్నుకున్నారు. కూసుమంచిలో ఆదివారం సమావేశమైన ట్రైబల్ వెల్ఫేర్ రీజనల్ ఉద్యోగులు నూతన అధ్యక్షుడిగా డీఈఈ తేజావత్ వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా కూసుమంచి ఏడీ కోక్యా నాయక్‌ను ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ్, ఉపేందర్, కోశాధికారిగా బాలాజీ, మహిళా ప్రతినిధిగా చంద్రకళ, గౌరవ సలహాదారుగా శ్రీధర్ ఎన్నికయ్యారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మధిరరూరల్, డిసెంబర్ 8 : మండల పరిధిలోని ఇల్లూరు గ్రామ సమీపంలో సుబాబుల్‌తోటలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు మధిర పట్టణ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,330 నగదు, 10 మొబైల్‌ఫోన్లు, 5 మోటార్‌సైకిల్స్ స్వాధీనం చేసుకున్నారు. కర్ర సాంబశివరావు, అద్దంకి పూర్ణయ్య, కోటా కిరణ్, పసంధుల బ్రహ్మం, పత్తిపాక స్వామి, పిల్లి రాముని అదుపులో తీసుకోగా, వినుకొండ కృష్ణ, మైకెల్, నాని, మధు, సాయిబు పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మధిర పట్టణ ఎస్సై సంధ్య తెలిపారు.

దూసుకొచ్చిన లారీ.. ఇద్దరు యువకులు మృతి

అశ్వారావుపేట, డిసెంబర్ 8: అతి వేగంతో దూసుకొచ్చిన లారీ.. ఇద్దరు యువకులను బలిగొంది. మరో యువకుడిని తీవ్రంగా గాయపరిచింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పి.నారాయణపురం గ్రామానికి చెందిన పేరాబత్తుల మనోజ్(27), దమ్మపేట మండలం మారప్పగూడెంలో కొంత భూమిని కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేస్తున్నాడు. మారప్పగూడెం గ్రామస్తుడు మొగిలి వీరభద్రం, అశ్వారావుపేట మండలం పాపిడిగూడేనికి చెందిన బద్దే వెంకటేశ్వరరావు(57)తో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం మారప్పగూడెం బయల్దేరాడు. నారంవారిగూడెం కాలనీ సమీపంలో వీరి వాహనాన్ని వికారాబాద్ జిల్లా తాండూరు నుంచి ఏపీలోని కొయ్యలగూడేనికి మట్టి పౌడర్ లోడుతో అతి వేగంగా వస్తున్న లారీ, ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోతూ అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఆ ముగ్గురూ గాల్లోకి ఎగిరి, రోడ్డు పక్కనున్న పొదల్లో పడ్డారు. మనోజ్, వెంటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందారు. వీరభద్రానికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ ఆగకుండా వెళ్లింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు.. రింగ్ రోడ్ సెంటర్‌లో దానిని అడ్డుకున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్ గోళ్ళ సైదులును అదుపులోకి తీసుకున్నారు. లారీని స్వాధీనపర్చుకున్నారు.

ముగ్గురివీ పేద కుటుంబాలే..

ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరితో పాటు తీవ్రంగా గాయపడ్డ విద్యార్థి కుటుంబం కూడా కన్నీటి పర్వంతమయ్యాయి. డిగ్రీ వరకు చదువుకున్న మనోజ్ సొంత భూమిలేకున్నా తల్లిదండ్రులకు తోడుగా కౌలు వ్యవసాయ చేస్తున్నాడు. ఈయన తండ్రి రాము కూడా కౌలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మరో మృతుడి బద్దే వెంకటేశ్వరరావు (గిరిజనుడు) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. ఆయన భార్య మూడేళ్ల క్రితమే పక్షవాతంతో మంచాన పడింది. కుమారులిద్దరూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న వీరభద్రానిది నిరుపేద గిరిజన కుటుంబం. ఆదివారం సెలవు రోజవడంతో రోజువారీ ఖర్చుల కోసం వ్యవసాయ కూలీ పనికి బయలుదేరాడు. ఇతని తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. తీవ్రంగా గాయపడిన వీరభద్రం.. రాజమండ్రి ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. మనోజ్ తండ్రి రాము ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు. దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు.

తెలుగులో ఈ నెల 13న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
మహాలక్ష్మి కాంప్లెక్స్ ఎ/సి - కొత్తపేట్ | లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట్
ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్ | బులు మూల్ - కూకట్‌పల్లి | ఎఎఎ ఎ/సి - అమీర్‌పేట్ | మురళీ సినిమాస్ - బడిఎల్
PVR ఆర్.కె - బంజారాహిల్స్ | CCPL - మల్కాజ్‌గిరి | ఎఎంఆర్ - మౌలాలి | మురళీ సినిమాస్ - చంద్రనగర్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | డి.ఎల్.ఎస్ - ఉప్పల్ | ఫ్లాటినమ్ - అమీర్‌పేట్ | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | మంత్రామాల్ - అత్తాపూర్ | ప్రైమ్‌మాల్ - సనత్‌నగర్ | లక్ష్మీనరసింహ - మియాపూర్
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి | సుధ - శాలిబండ | ఫ్లాటినమ్ - గచ్చిబౌలి | విజయలక్ష్మి - ఎల్‌బినగర్
PVR గలేరియా - పంజాగుట్ట | అపర్ణ సినిమాస్ - నల్లగండ